సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 6 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి. మార్కెట్‌కు 544 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
40.6°/18.8°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.



న్యూస్‌రీల్

94 శాతం పింఛన్ల పంపిణీ



అనంతపురం ఆస్పత్రిలో వెంకటరాముడికి పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ గౌతమి

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. వలంటీర్లు లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడికే వెళ్లి 'కానుక' పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే పుట్టపర్తి పెద్ద బజార్‌కు చెందిన వెంకటరాముడు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, విషయం తెలుసుకున్న వలంటీర్ గౌతమి అక్కడికే వెళ్లి పింఛన్ మొత్తం అందజేయడంతో వెంకట రాముడు కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు. ఇక జిల్లాలో 2,64,128 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, బుధవారం నాటికి 2,48,843 మందికి (94 శాతం) పింఛన్ మొత్తం అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

భాస్కర్‌రెడ్డికి కీలక పదవి

- జిల్లా సాధారణ పరీక్షల బోర్డు కార్యదర్శిగా నియామకం



భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట

ప్రశాంతి నిలయం: నల్లమాడ మండలం ఎర్రవంకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.భాస్కర్‌రెడ్డికి కీలక పదవి దక్కింది. ఆయన్ను జిల్లా సాధారణ పరీక్షల బోర్డు కార్యదర్శిగా నియమిస్తూ ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగుతారని పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలోనే పరీక్షల నిర్వహణ, పుస్తకాల రూపకల్పన, శిక్షణా కార్యక్రమాలు, వార్షిక క్యాలెండర్ రూపొందించడం వంటి కార్యక్రమాలు జరగనున్నాయి. భాస్కర్ రెడ్డి నియామకం పట్ల పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సిద్దారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

సస్పెన్షన్ ఎత్తివేయిస్తా

- పలువురు టీచర్లకు అగంతకుడు ఫోన్
- ఖర్చవుతుందంటూ నమ్మబలికిన వైనం

రాప్తాడురూరల్: 'హలో సర్...నేను ఎస్‌సీఈఆర్టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్)లో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నా. మీరు సస్పెండ్ అయ్యారట కదా? మీకు ఏమీ ఇబ్బంది ఉండదు. ఆర్జేడీ సార్ చెప్పారు. ఆయనతో మాట్లాడి మీకు చెబుతా. కొంత ఖర్చవుతుంది' అంటూ ఓ అగంతకుడు రెండు రోజుల కింద సస్పెన్షన్ అయిన టీచర్లకు ఫోన్లు చేయడం విద్యాశాఖలో కలకలం రేపుతోంది. పదో తరగతి పరీక్షలు, ఓపెన్‌స్కూల్ పరీక్షల్లో తొలిరోజు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరుగురు టీచర్లను సస్పెండ్ చేశారు. బుధవారం ఈ టీచర్లకు 85200 95158 నంబరు నుంచి ఫోన్లు వచ్చాయి. సస్పెన్షన్లు ఎత్తివేసేందుకు తాను ఆర్జేడీతో మాట్లాడతానని నమ్మబలికి డబ్బులు అడిగే ప్రయత్నం చేశాడు. అనుమానం వచ్చిన టీచర్లు, వివిధ సంఘాల నాయకుల ద్వారా వచ్చిన నంబరుకు ఫోన్లు చేస్తే పేరు చెప్పకుండా తాను సెక్రటేరియట్‌లో పని చేస్తున్నానని ఒకసారి, ఎస్‌సీఈఆర్టీలో పని చేస్తున్నానని మరోసారి పొంతన లేని సమాధానాలు చెబుతూ కట్ చేస్తున్నాడు. ఈ విషయం ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన కూడా ఆ నంబరుకు ఫోన్ చేసి మాట్లాడారు. అగంతకుడు ఆర్జేడీతోనూ 'సార్‌తో మాట్లాడి నేను సస్పెన్షన్లు ఎత్తివేయిస్తానంటూ' చెప్పాడు. తాను ఆర్జేడీని మాట్లాడుతున్నానని చెప్పగానే 'సారీ సర్' అంటూ ఫోన్ కట్ చేశాడు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆర్జేడీ తెలిపారు. ఈ నంబరు నుంచి ఫోన్లు వచ్చిన టీచర్లు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆర్జేడీ సూచించారు. ఎవరికైనా ఇలాంటి ఫోన్లు వస్తే నమ్మొద్దన్నారు. నేరుగా తనకు ఫోన్ చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవాలని కోరారు.

డ్రోన్ సాగు.. ఉపాధి బాగు

వ్యవసాయంలో యాంత్రీకరణకు పెద్దపీట వేసిన వైఎస్ జగన్ సర్కార్... రైతన్నల కోసం అత్యాధునిక యంత్రాలు తెప్పిస్తోంది. ఈ క్రమంలోనే డ్రోన్ సాగును ప్రోత్సహించేందుకు సిద్ధమైంది. తద్వారా రైతుకు మేలు చేయడంతో పాటు యువతకు శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉపాధి కల్పించాలని భావిస్తోంది.



డ్రోన్ ద్వారా వరిమడిపై పురుగుమందు పిచికారీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

సులువుగా వ్యవసాయ పనులు

- యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు
- సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్లు అందజేస్తున్న ప్రభుత్వం
- జిల్లాకు 96 డ్రోన్లు అందించేందుకు సిద్ధమైన అధికారులు
- జూన్ నాటికి 20 మందికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక

పుట్టపర్తి అర్బన్: ఒకప్పుడు వరికోత యంత్రాలను అబ్బురంగా చూసిన జనం ఆ తర్వాత వాటిని వినియోగించుకునేందుకు అలవాటు పడ్డారు. ఇప్పుడు వ్యవసాయంలో డ్రోన్‌లను కూడా అంతే ఆశ్చర్యంగా చూస్తున్నారు. వాటి పనితనం తెలుసుకుంటూ డ్రోన్ల వినియోగానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఇప్పటికే డ్రోన్ సాగును ప్రయోగాత్మకంగా అమలు చేసింది. ఫలితం ఆశించినంత మేర ఉండటంతో రాష్ట్రమంతా విస్తరింపజేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని భావిస్తోంది.

విప్లవాత్మక మార్పులు..

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని భావిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి... వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. 'వైఎస్సార్ యంత్ర సేవ' పేరుతో ట్రాక్టర్లు, అత్యాధునిక యంత్ర పరికరాలు ఆర్బీకేల్లో ఉంచి రైతులకు మేలు చేశారు. దీంతో రైతులు కూడా వరినాట్లు వేసే యంత్రం నుంచి మొక్కజొన్న కోసి గింజలు ఆడించడం, వేరుశనగ తొలగింపు నుంచి ఆడించడం, ఎద్దులతో పని లేకుండానే దుక్కి దున్నడం, ట్రాక్టర్లతో మందుల పిచికారీ వంటి ఎన్నో పనులకు యంత్రాలు వినియోగించుకుంటున్నారు. అయితే ఉద్యాన పంటలైన మామిడి, అల్లనేరేడు, జామ, చీనీ, దానిమ్మ పంటలతో పాటు ఏపుగా పెరిగే కంది, తీగజాతి పంటలకు మందులు పిచికారీ చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రోన్ ద్వారా మందుల పిచికారీ అంశాన్ని పరిశీలించాయి. ఆశించిన ఫలితం రావడంతో రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

50 శాతం సబ్సిడీపై డ్రోన్లు..

ఇంటర్, ఆపై తరగతులు చదివిన యువతకు డ్రోన్లపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సామర్థ్యాన్ని బట్టి ఒక్కో డ్రోన్ రూ.10 లక్షల వరకూ ఉంది. ఇందులో ఐదుగురు ఒక గ్రూపుగా ఏర్పడి రూ. లక్ష డిపాజిట్ చేస్తే, రూ.4 లక్షలు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందిస్తుంది. మరో రూ.5 లక్షలు బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం కల్పిస్తుంది. గ్రూపుగా ఏర్పడిన ఐదుగురిలో ఒకరికి ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ ఆధ్వర్యంలో విజయవాడలో 12 రోజుల పాటు పైలెట్ శిక్షణ ఇస్తారు. వీరికి కచ్చితంగా పాస్‌పోర్ట్ ఉండాలి. ఇందు కోసం ప్రభుత్వం ఒక్కో అభ్యర్థికి సుమారు రూ.72 వేలు ఖర్చు చేస్తోంది. ఒక్కోబ్యాచ్‌లో 20 మందికే శిక్షణ ఇస్తారు. దీనికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అనుమతి ఉండాలి.

డ్రోన్లతో ఏం చేయొచ్చంటే...

వ్యవసాయ డ్రోన్లతో పురుగుమందుల పిచికారీ చేయవచ్చు. ఉలవ, జీలుగ, పిల్లిపెసర వంటి విత్తనాలు చల్లుకోవచ్చు. రైతు గ్రూపునకు వచ్చిన డ్రోన్‌ను సొంతపనులకు వినియోగించుకోవడంతో పాటు అవసరమైన సమయంలో ఇతర రైతులకు అద్దెకు ఇవ్వవచ్చు. ఒక డ్రోన్‌తో 10 నిమిషాల్లో ఒక ఎకరాకు, రోజుకు 35 ఎకరాల్లో పురుగు మందులు పిచికారీ చేయవచ్చు. ఇందుకు ఎకరాకు 750 ఎంఎల్ పెట్రోలు ఖర్చు అవుతుంది. బ్యాటరీలు ఛార్జింగ్ చేయవలసిన అవసరం లేదు. ఒక్కో డ్రోను 45 కిలోల బరువును సైతం పైకి తీసుకెళ్లగలదు.

జిల్లాకు 96 డ్రోన్లు ..

జిల్లాలో 32 మండలాలు ఉండగా, ప్రభుత్వం మండలానికి మూడు చొప్పున మొత్తం 96 డ్రోన్లు అందజేయనుంది. ముందుగా శిక్షణ పొందిన వారికి వాటిని అందజేస్తుంది. జూన్ నాటికి 20 మందికి డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ ఇస్తారు. డ్రోన్‌పై శిక్షణ పొందేందుకు మరింతమంది యువత ముందుకు రావాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రూ.10 లక్షలు ఒక్కో డ్రోన్ ధర	రూ.72 వేలు డ్రోన్‌పై శిక్షణకు ఒక్కో వ్యక్తి కోసం ప్రభుత్వం చేసే ఖర్చు
రూ.4 లక్షలు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ	
రూ.5 లక్షలు బ్యాంకు ద్వారా అందే రుణం	

మంచి నిర్ణయం



డ్రోన్ వ్యవసాయంతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం మంచి నిర్ణయం. చాలా మంది యువత ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికి శిక్షణ ఇవ్వడం వల్ల స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. అవకాశం కల్పిస్తే ప్రతి ఒక్కరూ ఉపాధి పొందడమే గాక వ్యవసాయం చేయడం చాలా సులువు అవుతుంది. – గురుప్రసాద్‌రెడ్డి, ప్రశాంతిగ్రామం

సద్వినియోగం చేసుకోవాలి



ఇంటర్, ఆపై చదువులు చదివి ఇంటి పట్టునే ఉన్న నిరుద్యోగ యువత డ్రోన్ వ్యవసాయంతో ఉపాధి పొందవచ్చు. ఇప్పటికే జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు విజయవాడలో శిక్షణ పొందుతున్నారు. జూన్ నాటికి 20 మందికి శిక్షణ ఇప్పిస్తాం. ఆసక్తి కలిగిన వారు ఆధార్, విద్య, భూమి వివరాలను మాకు అందజేస్తే తప్పక శిక్షణ ఇప్పిస్తాం.
– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

ఉమ్మడి జిల్లాలో కొత్తగా 5 ఇసుక రీచ్‌లు

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలో 5 కొత్త ఇసుక రీచ్‌లను గుర్తించినట్లు భూగర్భ గనులశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ నాగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లా పామిడి, గార్లదిన్నె మండలం ఇల్లూరు, కంబదూరు మండలం కర్తనపర్తి గ్రామాల్లోని ఇసుక రీచ్‌ల్లో దాదాపు 1.50లక్షల మెట్రిక్ టన్నులు, శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పరిధిలోని తూముకుంట, కొడిగెనహళ్లిలో రెండు రీచ్‌ల్లో 1.12లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. వీటితోపాటు ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ మండలం రాయవారిపల్లి, ఉప్పలపాడు, పీసీ రేవు గ్రామాల్లో మరో మూడు ఇసుక రీచ్‌ల అనుమతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత లేకుండా ఉండేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఇసుక డిపోలకు ఆయా ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తరలిస్తున్నట్లు తెలిపారు.

త్వరలోనే లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణం



కొండపై విలేకరులతో మాట్లాడుతున్న ఇస్కాన్ నిర్వాహకుడు మధు పండిట్

పెనుకొండ: కొండపై త్వరలోనే లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ఇస్కాన్ నిర్వాహకుడు మధుపండిట్ దాస్ తెలిపారు. బుధవారం ఆయన పెనుకొండ పర్యాటక పోరాట కమిటీ అధ్యక్షుడు ప్రతాపరెడ్డితో కలిసి కొండ ప్రాంతంలో ఆలయ నిర్మాణం కోసం పరిశీలన చేశారు. అనంతరం మధుపండిట్ దాస్ విలేకరులతో మాట్లాడారు. కొండ రోడ్డు నిర్మాణం పూర్తయిందని, త్వరలో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రజలు, పర్యాటక ప్రియులు అబ్బుర పడేలా ఆలయ నిర్మాణం చేపడుతామన్నారు.

సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్ రామ్

జయంతి వేడుకల్లో కలెక్టర్ బసంత్‌కుమార్



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ తదితరులు

పుట్టపర్తి అర్బన్: ప్రముఖ స్వాతంత్య్ర సమర యోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జీవితం ఆదర్శప్రాయమని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని 'స్పందన' హాలులో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ పాల్గొన్నారు. తొలుత జగ్జీవన్ రామ్ నిలువెత్తు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్య్ర సంగ్రామంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ తనవంతు పాత్ర పోషించారన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాడిన విప్లవ యోధుడన్నారు. ఆయన జయంతిని దేశవ్యాప్తంగా 'సమతా దినోత్సవం'గా జరుపుకుంటున్నామన్నారు. జగ్జీవన్ రామ్ 30 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా, 46 సంవత్సరాలు పార్లమెంట్ సభ్యుడిగా పని చేశారని, ఆయనకు దక్కని హోదాలు లేవన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ మాట్లాడుతూ, జగ్జీవన్‌రామ్ బాటలో ప్రతి ఒక్కరూ నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.

జిల్లా కేంద్రంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం..

ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. ఆయన బాటలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నడుస్తోందన్నారు. విద్యతోనే సామాజిక, ఆర్థిక స్థితిగతులు మెరుగవుతాయని నమ్మిన సీఎం వైఎస్ జగన్ 'నాడు-నేడు'తో పాఠశాల విద్యలో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానం పూర్తి స్థాయిలో అమలయ్యేలా చూస్తామని, ఎస్సీలకు సంబంధించి శ్మశాన వాటికలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అలాగే త్వరలోనే జిల్లా కేంద్రంలో బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలతో పాటు కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అంతకు ముందు జిల్లాకు చెందిన పలువురు దళిత నాయకులు జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగప్రసాద్, అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, దళిత సంఘాల నాయకులు బేకరీ గంగాధర్, పైపల్లి నరసింహులు, సాయి, ఎస్‌డీటీ నరసింహులు, రామాంజనేయులు, రాయుడు, కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

పోస్టుల వివరాలు

ప్రాజెక్టు	కార్యకర్త	సహాయ కార్యకర్త	సహాయకులు
ధర్మవరం	1	-	4
సీకేపల్లి	2	-	6
మడకశిర	-	-	7
హిందూపురం	2	-	15
కదిరి ఈస్ట్	-	-	4
కదిరి వెస్ట్	-	1	1
పెనుకొండ	3	1	10



పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో 8 అంగన్‌వాడీ కార్యకర్తలు, 2 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 47 సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. గడువు తీరిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమన్నారు. దరఖాస్తులు ఆయా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. 7 జూలై 2022 నాటికి 21- 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసిన ప్రాంతాల్లో 21 ఏళ్లు నిండిన అభ్యర్థులు లేకపోతే 18 ఏళ్లు నిండిన వారూ అర్హులేనన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.11500, మినీ కార్యకర్త, సహాయకులకు రూ.7 వేల గౌరవ వేతనం ఉంటుందన్నారు. తక్కిన వివరాలకు ఆయా ప్రాజెక్టుల్లోని సీడీపీఓలను సంప్రదించాలన్నారు.

దళారులను నమ్మకండి

అంగన్‌వాడీ పోస్టులు ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు విని మోసపోవద్దని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి అన్నారు. అంగన్ వాడీ పోస్టుల భర్తీ అర్హత మేరకు పూర్తి పారదర్శకతతో సాగుతుందన్నారు. ఎవరైనా పోస్టులిప్పిస్తామని డబ్బులు అడిగితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పంగుణి ఉత్సవం.. భక్తి పారవశ్యం



వీపు, దవడలకు శూలాలను గుచ్చుకుని ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

హిందూపురం: దశాబ్దాల క్రితం హిందూపురం వచ్చి స్థిరపడిన తమిళనాడు వాసులు తమ ఆరాధ్యదైవం సుబ్రహ్మణేశ్వర స్వామిని భక్తి శ్రద్ధలతో కీర్తించారు. ఏటా నిర్వహించే 'పంగుణి' ఉత్సవంలో భాగంగా బెంగళూరు రోడ్డులోని పళనీనగర్, ఇందిరానగర్ వాసులు బుధవారం ఉదయం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం విల్లక్కు రథాలు, కావడీలు తీసుకుని శరీరానికి శూలాలు, అంబులు, కొక్కేలు జొప్పించుకుని 'హరఓం...హర' అంటూ పార్వతీ తనయుడిని కీర్తించారు. ప్రత్యేకంగా తయారు చేసుకున్న విలక్కుల రథాలను కొక్కేలతో శరీరానికి గుచ్చుకుని లాగుతూ ప్రదర్శన చేశారు. మాలధారులు దవడల్లో శూలాలు గుచ్చుకుని, వంటికి కొక్కేలు కుచ్చుకుని రథోత్సవంలో పాల్గొన్నారు. ఒళ్లు గగుర్పొడిచేలా సాగిన తమిళుల ఊరేగింపును స్థానికులు ఆసక్తిగా తిలకించారు.



వీపునకు కొక్కేలు తగిలించుకుని వేలాడుతున్న భక్తులు



బోయపేటగుండా సాగుతున్న 'పంగుణి' ఉత్సవం

భక్తిశ్రద్ధలతో శ్రీగిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో భారీగా పాల్గొన్న భక్తులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి భక్తులు శ్రీగిరిప్రదక్షిణ నిర్వహించారు. బుధవారం సాయంత్రం ప్రశాంతి నిలయం గణేష్ గేట్ వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయిని కొనియాడుతూ భక్తిగీతాలు ఆలపిస్తూ గిరిప్రదక్షిణలో భక్తులు ముందుకు సాగారు. గోలకుం, ఎనుములపల్లి గణేష్ సర్కిల్, ఆర్‌వీజే పెట్రోల్ బంక్, వెస్ట్‌గేట్ మీదుగా పుట్టపర్తి పట్టణంలోకి చేరుకుని గణేష్ గేట్ వద్ద మంగళహారతితో ముగించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది సత్యసాయి భక్తులు ప్రదక్షిణలోపాల్గొన్నారు.

డిప్యూటీ సీఈఓ బాధ్యతల స్వీకరణ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా ఎండీ అమృతరాజ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఉరవకొండ ఎంపీడీఓగా పని చేస్తున్న ఆయన జెడ్పీ అకౌంట్స్ ఆఫీసర్‌గా రెండు నెలల క్రితమే వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనను జెడ్పీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మర్తాడు షేక్ రఫీ, కేశవ సహా పలు విభాగాల ఏఓలు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.


డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు తీసుకుంటున్న అమృతరాజ్

- సత్ఫలితాన్నిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం
- జిల్లా వ్యాప్తంగా 379 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు
- ఇప్పటి వరకూ 1,53,790 మంది రోగులకు గడప వద్దనే వైద్య సేవలు
- నేడు పూర్తి స్థాయిలో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

ట్రయల్ రన్‌లో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందిన సేవలు	
జనరల్ ఓపీ	1,11,329
ఔట్ పేషెంట్లు	1,53,790
అడల్ట్స్ కౌన్సిలింగ్	195
గర్భిణులు	9,919
బాలింతలు	6,003
రక్తహీనత	590
హైపర్ టెన్షన్	14,906
డయాబెటిస్	10,243
నోటి క్యాన్సర్	217
బ్రెస్ట్ క్యాన్సర్	58
సర్వైకల్ క్యాన్సర్	315
ట్యూబరిక్యులోసిస్(టిబి)	13

ఇంటి వద్దకే వైద్యం

వైద్యం అంటే చెప్పలేనంత ఖర్చుతో కూడుకున్న పని. కార్పొరేట్ ఆసుపత్రుల్లో మంచి వైద్యం అందుతున్నా.. అక్కడి ఖర్చు భరించే స్తోమత సామాన్యుడికి లేదు. ఇక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి గురించి చెప్పనక్కర్లేదు. ప్రభుత్వాసుపత్రులకు వెళితే గంటల తరబడి వేచి ఉండాల్సిన పని. అలాగని ప్రతీ అవసరానికి కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లలేని స్థితి. దీంతో ఎంతో మంది సరైన వైద్యానికి నోచుకోక మనోవేదనకు గురవుతున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను సర్కార్ అక్కున చేర్చుకుంటోంది. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దకే వైద్య సిబ్బంది వెళ్లి రోగులకు చికిత్సలు అందజేస్తున్నారు. వారికి కావాల్సిన మందులు, ఆహారం, వైద్య సేవలు ఉచితంగా అందిస్తూ మనోధైర్యాన్ని కల్పిస్తున్నారు.


కోట్లపల్లిలో ఏర్పాటు చేసిన 104 వైద్యశిబిరం (ఫైల్)


జగరాజుపల్లిలో ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ (ఫైల్)

ప్రశాంతి నిలయం: గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం సత్ఫలితాన్నిస్తోంది. రోగుల ఇంటి వద్దకే వైద్యులు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా చికిత్స అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 379 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో ఇప్పటి వరకూ 1,53,790 మంది రోగులు సేవలు అందుకున్నారు.

ప్రజల చెంతకే వైద్యులు..

గతంలో ఆర్థిక స్తోమత కలిగిన కుటుంబాలు మాత్రమే ఫ్యామిలీ డాక్టర్‌ను ఏర్పాటు చేసుకుని, వారి ద్వారా చికిత్స పొందేవారు. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు నేరుగా ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి గంటల తరబడి వేచి ఉండి చికిత్స పొందేవారు. దీంతో రోగులపై ఎంతో ఆర్థిక భారం పడేది. ఈ పరిస్థితికి చెక్ పెడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ విధానానికి శ్రీకారం చుట్టారు. ఈ విధానం ద్వారా మారుమూల ప్రాంతాలకు చెందిన పేదలకు సైతం ఇంటి వద్దనే నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది అక్టోబర్ 1 నుంచి ప్రయోగాత్మకంగా అమలవుతున్న ఈ విధానాన్ని గురువారం నుంచి పూర్తి స్థాయిలో సీఎం వైఎస్ జగన్ అందుబాటులోకి తీసుకురానున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుకు జిల్లా వ్యాప్తంగా 32 మండలాల పరిధిలో మండలం యూనిట్‌గా 104 వాహనాలను సమకూర్చారు. 13 కంటే ఎక్కువ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఉన్న మండలాలకు ఇటీవల ప్రభుత్వం అదనంగా మరో నాలుగు కొత్త 104 వాహనాలను సమకూర్చింది.

ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు..

గతంలో వైద్య పరీక్షల కోసం రోగులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య బృందం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ నివేదిక అందగానే ఉచితంగా చికిత్సతో పాటు మందులూ అందజేస్తున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా జిల్లా వ్యాప్తంగా రోజూ 2,500 నుంచి 3 వేల మంది వరకు ఓపీ సేవలు అందుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ఇంటి వద్దకే డాక్టర్ వెళ్లి చికిత్స చేస్తున్నారు. 14,906 మంది రక్తపోటు వ్యాధిగ్రస్తులు, 10,243 మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా ఉచితంగా మందులను ఇంటి వద్దనే అందుకుంటున్నారు.

నేటి నుంచి పూర్తి స్థాయిలో..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని గురువారం నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకెళ్లనున్నాం. జిల్లాకు సంబంధించి బుక్కపట్నం మండలం సిద్ధరాంపురం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ బసంత్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. – డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఎంహెచ్ఓ

మెరుగైన సేవలు అందుతాయి



ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యం చేరువకానుంది. ప్రజల వద్దకే వెళ్లి చికిత్స చేయడం అనేది ఎంతో గొప్ప విషయం. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించడం ద్వారా రోగాన్ని త్వరగా నయం చేయవచ్చు. – డాక్టర్.నాగరాజు నాయక్, పీహెచ్‌సీ, పుట్టపర్తి

శ్రమ, ఖర్చు తగ్గాయి



నా వయస్సు 85 సంవత్సరాలు. చాలా రోజులుగా కాళ్ల నొప్పులతో బాధపడుతున్నా. గతంలో పుట్టపర్తికి పోయి చూపించుకోవాల్సి వచ్చేది. రానుపోనూ రూ.200కు పైగా ఖర్చయ్యేది. దీనికి తోడు ఎంతో శ్రమ పడ్డాను. ఇప్పుడు మా ఊరికే వచ్చి పరీక్ష చేసి మందులు ఇస్తున్నారు. ప్రభుత్వం మంచి పని చేసింది. మాకు శ్రమ, ఖర్చు తగ్గాయి. – లింగమ్మ, జగరాజుపల్లి

నీట మునిగి విద్యార్థి మృతి

గుమ్మఘట్ట: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన తిప్పేశి, మాలక్క దంపతులకు గణేష్ (14)తో పాటు మరో కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గణేష్... బుధవారం పాఠశాలకు సెలవు కావడంతో స్నేహితులతో కలసి సరదాగా ఈత కొట్టేందుకు వేదవతి హగరి నదికి వెళ్లాడు. లోతైన ప్రాంతంలో దిగడంతో ఈత రాక నీటి మునిగిపోవడంతో స్నేహితులు గట్టిగా కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేశారు. స్థానికులు అక్కడకు చేరుకుని నీటిలో గాలించి గణేష్‌ని వెలికి తీశారు. అప్పటికే ఊపిరి ఆడక బాలుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సునీత అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

చోరీల కలకలం

గుత్తి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న వాణిజ్య సముదాయంలోని నాలుగు దుకాణాల్లో దుండగులు చొరబడి విలువైన సామగ్రి, నగదు అపహరించుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. దూద్‌పీరా, జిలాన్, షేక్షావలి, సాహెబ్‌కు చెందిన మెకానిక్, స్పేర్‌పార్ట్స్, టింకరింగ్ దుకాణాలకు కన్నాలు వేసి లోపలకు ప్రవేశించినట్లుగా పోలీసులు గుర్తించారు. మరో రెండు దుకాణాల్లోనూ చోరీకి విఫల యత్నం చేశారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేడు సంగమేశ్వరుడి రథోత్సవం

కూడేరు: మండల కేంద్రంలో వెలసిన శివపార్వతుల జోడులింగాల సంగమేశ్వర ఆలయ రథోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, ఈఓ బాబు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల కోర్కెలు తీర్చేందుకు ఆదిదంపతులు స్వయంభువుగా ఇక్కడ వెలిసినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. ఉత్సవంలో భాగంగా గురువారం ఉదయం 9.40 గంటలకు మడుగు తేరు, సాయంత్రం ఆరు గంటలకు ప్రధాన రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

స్టోర్ డీలర్‌పై కొడవళ్లతో దాడి

పుట్టపర్తి: రేషన్ పంపిణీ విషయంగా గొడవ పెట్టుకుని డీలర్‌పై కొడవళ్లతో దాడి చేసిన ఘటన మండలంలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం కొండాపురం గ్రామానికి చెందిన నల్లపరెడ్డి.. ప్రభుత్వ చౌక ధాన్యపు డిపోను నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వైఎస్సార్‌సీపీ నాయకుడిగా ఆయనకు మంచి పేరుంది. బుధవారం ఉదయం అదే గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి, ఆయన సోదరులు శివారెడ్డి, శ్రీనివాస రెడ్డి నేరుగా చౌకధాన్యపు డిపో వద్దకెళ్లి గ్రామంలో అందరికంటే ముందుగా తమకే రేషన్ అందజేయాలని డిమాండ్ చేశారు. నిబంధన మేరకు వాహనాన్ని ఇంటి వద్దకే పంపి రేషన్ అందజేస్తామని నల్లపరెడ్డి తెలపడంతో వాగ్వాదానికి దిగారు. మాటలతో రెచ్చగొడుతూ ముందుగా తెచ్చుకున్న కారం పొడిని నల్లపరెడ్డి కళ్లలోకి చల్లి వేటకొడవలితో దాడికి తెగబడ్డారు. అడ్డుకోబోయిన కుమారులు మల్లేష్, మాధవరెడ్డిపై సైతం కర్రలతో దాడి చేశారు. అప్పటికే జనం పోగవుతుండడంతో మోహన్‌రెడ్డి, ఆయన సోదరులు అక్కడి నుంచి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన నల్లపరెడ్డి, మాధవరెడ్డిని స్థానికులు అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


చికిత్స పొందుతున్న నల్లపరెడ్డి


గాయపడిన మాధవరెడ్డి

నూర్పిడి యంత్రంలో పడి మహిళ మృతి

ముదిగుబ్బ: బతుకు తెరువు కోసం కూలి పనులకు వచ్చిన ఓ మహిళ ప్రమాదవశాత్తు నూర్పిడి యంత్రంలో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... ముదిగుబ్బ మండలం అడవి బ్రాహ్మణపల్లి తండాకు చెందిన భూకాయ వెంకటనాయక్, తులసీబాయి (45) దంపతులు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్న వీరికి ఇద్దరు పిల్లలున్నారు. బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ రైతు పొలంలో వేరుశనగ కట్టె నూర్పిడి పనుల్లో తులసీబాయి పాలుపంచుకుంది. నూర్పిడి యంత్రం వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తు చీర కొంగు యంత్రంలోకి చిక్కుకుని లాగడంతో అదుపు తప్పి ఆమె అందులోకి పడిపోయింది. అప్రమత్తమైన కూలీలు యంత్రాన్ని ఆపేలోపు ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.


తులసీబాయి (ఫైల్)

భార్యను చంపి.. భర్త ఆత్మహత్య!


చెట్టుకు ఉరి వేసుకున్న వెంకటేష్


రక్త గాయాలతో మృతిచెందిన రాధమ్మ

మడకశిర రూరల్: భర్త మృతదేహం చెట్టుకు వేలాడుతుండగా... ఆ పక్కనే భార్య రక్తపు గాయాలతో మృతి చెందింది. దీంతో భార్యను చంపి భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వివరాలు.. మడకశిర మండలం ఎగువ రామగిరి గ్రామానికి చెందిన చింతగుట్లప్ప, నింకమ్మ దంపతుల కుమారుడు వెంకటేష్ (42)కు 14 ఏళ్ల క్రితం కర్ణాటకలోని పావగడ తాలూకా ఈర్లగొంది గ్రామానికి చెందిన బొమ్మక్క కుమార్తె రాధమ్మ (35)తో వివాహమైంది. వీరికి 12 ఏళ్ల వయసున్న కుమార్తె ఉంది. పరిగిలోని గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికురాలిగా రాధమ్మ పనిచేస్తోంది. మంగళవారం అర్ధరాత్రి గ్రామ శివారులోని రోడ్డు పక్కన చెట్టుకు వెంకటేష్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ పక్కనే రాధమ్మ రక్తగాయాలతో విగతజీవిగా పడి ఉంది. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన వారు మృతదేహాలను గమనించి, సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యుల రోదనలతో ఆ ప్రాంతం నిండిపోయింది. భార్యను హత్య చేసి, అనంతరం వెంకటేష్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. సమాచారం అందుకున్న సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ నాగేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. ద్విచక్రవాహనం, కట్టె, తాడు స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను వెంకటేష్ హతమార్చి ఉంటాడనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేశారు.

పథకం ప్రకారమే..

ఘటనపై రాధమ్మ తల్లి బొమ్మక్క మాట్లాడుతూ.. పథకం ప్రకారమే తన కుమార్తెను అల్లుడు హతమార్చాడని, అనంతరం పోలీసులకు భయపడి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించింది. మంగళవారం రాత్రి ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై కుమార్తెను గ్రామ శివారులోకి పిలుచుకెళ్లి, కట్టెతో కొట్టి హతమార్చినాడని బోరున విలపించింది. గ్రామంలో ఈ నెల 10న జాతర ఉందని, ఖర్చులకు డబ్బు కావాలంటే కొంత మొత్తాన్ని కూడా ఇచ్చినట్లు గుర్తు చేసింది. గతంలోనూ కుమార్తెను వేధిస్తుండడంతో పావగడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పట్లో స్టేషన్‌లో రాజీ చేశారని, అయినా అల్లుడిలో మార్పు రాలేదని పేర్కొంది. రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని కుమార్తెతో గొడవపడేవాడని, ఈ క్రమంలోనే భార్యను పథకం ప్రకారమే వెంకటేష్ హతమార్చి, ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

డీపీఓలో జగ్జీవన్‌రామ్ జయంతి


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

కొత్తచెరువు: బాబూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తిదాయకమని ఏఆర్‌డీఎస్పీ విజయ్‌కుమార్ అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. స్వతంత్ర సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, భారత ఉపప్రధానిగా జగ్జీవన్‌రామ్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ అడ్మిన్ ఆర్‌ఐ టైటాస్, ఆర్ఎస్ఐలు చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, ప్రదీప్ సింగ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విరగ్గాసిన నూతన వంగడం


వేరుశనగ కాయలు చూపుతున్న రైతులు

రొద్దం: మండలంలోని కోగిర గ్రామంలో కొందరు రైతులు సాగు చేసిన కదిరి 12, 18 రకం నూతన వేరుశనగ వంగడం అధిక దిగుబడినిచ్చింది. ఎకరాకు దాదాపు 18 క్వింటాళ్ల దిగుబడి రావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా రైతులు చిలకల రవి, రామాంజి, గోపాల్, పోతన్న, నారాయణ స్వామి మాట్లాడుతూ.. తమకున్న 25 ఎకరాల్లో కదిరి 12, 18 రకం వేరుశనగను రబీ పంట కింద సాగుచేసినట్లు పేర్కొన్నారు. అన్ని రకాల వ్యాధులకు పంట తట్టుకోవడంతో పాటు ఒక్కో చెట్టుకు 100 నుంచి 120 కాయలు కాసినట్లు వివరించారు.

చౌక బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చూపుతున్న విజిలెన్స్ అధికారులు

నల్లమాడ: మండలంలోని బాపనకుంటలో అక్రమంగా నిల్వ చేసిన 105 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని మంగళవారం అర్ధరాత్రి విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చుట్టుప్రక్కల గ్రామాల్లో ప్రజల నుంచి చౌక బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి తరలించేందుకు రహస్య స్థావరంలో డంప్ చేశారు. ఈ విషయాన్ని పసిగట్టిన విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి విస్తృత తనిఖీలు చేపట్టి, అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామంలోని ఓ రహస్య స్థావరంలో బియ్యం నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు సంబంధించి బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం అందజేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వలీబాషా తెలిపారు.